క్లుప్తంగా

ధ్రువపత్రాలు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు అటెండెన్స్‌కు సంబంధించి ధ్రువపత్రాలు ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఓ, ఏపీఓలు 5 రోజులు, ఓపీఓలు 4 రోజులు విధులు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రవికుమార్, నర్సిములు, భాస్కర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను కాపాడేందుకు హద్దులు ఏర్పాటు చేయాలని సామాజిక వేత్త అనిల్ కుమార్ గురువారం తహశీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. భూములను తక్షణమే గుర్తించాలన్నారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో 15,449 ఎకరాల ఆలయ భూములు ఉన్నాయని వాటిలో 1776 ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయన్నారు. అవన్నీ సాధించే వరకు తమ పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు సత్తయ్య, అయ్యన్న, బాలకృష్ణ, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

నేడు భూలక్ష్మీదేవి బోనాలు

నవాబుపేట: మండల కేంద్రలోని మార్కెట్ యార్డులో ఉన్న భూలక్ష్మీదేవి ఆలయంలో శుక్రవారం బోనాల కార్యక్రమం చేపడుతున్నట్లు నిర్వాహకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారీ తెలిపారు. శుక్రవారం ఉదయం గణపతి పూజ, అమ్మవారికి ప్రత్యేకపూజలు, ఉంటాయన్నారు. అనంతరం గ్రామ మహిళలు, హమాలీ, చాట, వ్యాపార సంఘాల ఆధ్వర్యంలో బోనాల ఉత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

బీపీ బాధితులు పెరుగుతున్నారు

పాలమూరు: ప్రపంచ హైపర్ టెన్షన్ నెల సందర్భంగా ఆరోగ్య ఆస్పత్రి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అధిక రక్తపోటు నియంత్రణ కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుబ్బ ప్రదీప్ మాట్లాడుతూ దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు అధిక రక్తపోటు బారినపడుతున్నారని తెలిపారు. దీనిని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ మంచి ఆహార అలవాట్లు అలవర్చుకోవాలని, ఉదయం యోగా, ధ్యానం, వాకింగ్ చేయాలన్నారు. ధూమపానం, మద్యం పానం మానేయాలన్నారు. క్రమం తప్పకుండా బీపీ పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది అనిరుధ్, శివ, మహేష్ పాల్గొన్నారు.

వేసవి శిబిరంలో కిక్‌బాక్సింగ్ శిక్షణ



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆర్‌కే స్పోర్ట్స్ కరాటేడూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ ఆవరణలో వేసవి శిబిరంలో విద్యార్థులకు కిక్‌బాక్సింగ్‌లో శిక్షణా తరగతులు నిర్వహించినట్లు స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్ తెలిపారు. గత నెల 26 నుంచి వేసవి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల నుంచి 50 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో పాయింట్‌ఫైట్, మ్యూజికల్‌ఫామ్‌లలో శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపారు. గురువారం శిక్షణ శిబిరాన్ని గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత సందర్శించి విద్యార్థులను అభినందించారు.

రైతులకు ఇబ్బందులు రానివ్వం

సాక్షి ఎఫెక్ట్..



లింగంపల్లిలో కొనుగోలు కేంద్రం పర్యవేక్షణ చేస్తున్న తహసీల్దార్ నాన్యనాయక్

నవాబుపేట: రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ చేసి వారికి బిల్లులు అందించే వరకు అధికారులు పర్యవేక్షణ ఉంటుందని తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. కాగా గురువారం సాక్షిలో ప్రచురితమైన వానొస్తే అరిగోసే కథనానికి అధికారులు స్పందించారు. జేసీ మోహన్‌రావు, ఇతర అధికారులు మండల పరిధిలోని లింగంపల్లి, కొల్లూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు లోడింగ్ చేస్తున్నట్లు వివరించారు. ఆలస్యం చేయకుండా వెంటనే తూకాలు చేసి లోడింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కాగా అకాలా వర్షాల నేపథ్యంలో వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. ఇదిలా ఉండగా అదనపు కలెక్టర్ మోహన్‌రావు కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిత్యం మండలాల వారీగా పర్యవేక్షణ చేస్తున్నారు. కాగా ధాన్యం విషయంలో ఎలాంటి కంగారు పడాల్సిన అవసరం లేదని తహసీల్దార్ నాన్యనాయక్ సూచించారు. అన్ని కేంద్రాల్లో మండల అధికార యంత్రాగం పర్యవేక్షణ చేస్తుందని.. ఎలాంటి ఇబ్బందులు ఉన్న అధికారుల దృష్టికి తీసుకుని రావాలని రైతులకు సూచించారు. మండలంలో ఇప్పటికే 4,190 బస్తాల ధాన్యం లోడింగ్ చేసినట్లు, లింగంపల్లి కొనుగోలు కేంద్రంలో మరో 530 బస్తాల ధాన్యం లోడింగ్ చేశామని వివరించారు. ఆయన వెంట మండలంలోని వివిధ శాఖల అధికారులతో పాటు మహిళ సమాఖ్య సభ్యులు లక్ష్మమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఫ్లైఓవర్ నిర్మాణంపై పరిశీలించాలని లేఖ



శంకరాయపల్లి తండా గేట్

- ప్రజావాణిలో వినతితో అధికారుల స్పందన

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్– జడ్చర్ల ప్రధాన రహదారిపై (167వ నంబరు జాతీయరహదారి) శంకరాయపల్లి తండ గేట్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం ప్రతిపాదనలు పరిశీలించాలని జాతీయరహదారుల శాఖ ఈఈ కి జిల్లా రోడ్లు భవనాలశాఖ అధికారి లేఖ రాశారు. రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని శంకరాయపల్లి తండాకు చెందిన గోపాల్ నాయక్‌తోపాటు మరికొందరు ముఖ్యమంత్రి పేషీ ప్రజావాణిలో ఫిబ్రవరి 10న వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు స్పందించి ప్రజావాణి పేషీ నుంచి జిల్లా రోడ్లు, భవనాలశాఖ జిల్లా అధికారి రాములుకు వినతిపత్రాన్ని పంపిస్తూ సమస్య పరిష్కరించాలని సూచించారు. దీంతో ఆయన సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఈనెల 21న జాతీయరహదారుల శాఖ ఈఈకి లేఖను రాశారు. అదేవిధంగా ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తుకు స్పందించి సంబంధిత శాఖకు సమాచారం అందించామని తండావాసులకు ప్రతిని గురువారం అందజేశారు. రోడ్లు భవనాలశాఖ అధికారి నుంచి లేఖ అందుకున్న జాతీయరహదారుల శాఖ ఈఈ రెండు రోజుల్లో ఘటనాస్థలాన్ని సందర్శించి ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించి పరిశీలిస్తామని తండావాసులకు హామీ ఇచ్చారు. ఇదిలా ఉంటే వాస్తవానికి ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతుండటంతో వాటిని అరికట్టేందుకు పోలీసులు స్టాపర్లు ఏర్పాటు చేశారు. జాతీయరహదారి నుంచి శంకరాయపల్లి తండా, మాటుబండతండాతో పాటు మరో నాలుగు తండాలు, శంకరాయపల్లి గ్రామం, క్రషర్ మిషన్, కాటన్‌మిల్, బండమీదిపల్లి, వల్లూరు, పెద్దపల్లి, ఉదండాపూర్ వెళ్లేందుకు మార్గం ఉంది. భవిష్యత్‌లో ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే మహబూబ్‌నగర్ వైపు నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఇదేమార్గం ద్వారా చేరుకుంటారు. ఈ కారణంగా వాహనాల రాకపోకలు పెరిగే ఆస్కారం ఉంది. ఈ మార్గంలో శంకరాయపల్లి తండా రోడ్‌కు వాహనాలు మళ్లే క్రమంలో భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. జాతీయ రహదారి అయ్యాక ఇప్పటి వరకు ఈ మార్గంలో 6మంది వరకు మృత్యువాతపడ్డారు. మరెందరో క్షతగాత్రులయ్యారు. సమస్యపై జనవరిలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి ప్రజాదర్బార్‌లో తండావాసులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అధికారుల్లో కదలిక మొదలైంది.

అడ్డాకూలీలకు ఆశ్రయం కల్పించాలంటూ వినతి



వినతిపత్రం ఇస్తున్న బీసీసేన నాయకులు

జడ్చర్ల టౌన్: భవన నిర్మాణ రంగ కార్మికులైన అడ్డాకూలీలకు తగిన ఆశ్రయం కల్పించాలని బీసీసేన ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీసేన మండల అధ్యక్షుడు నిరంజన్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు అడ్డాకూలీల సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు. ఏళ్లుగా ఆశ్రయం లేక కూలీలు రోడ్డుపైనే వేచి ఉంటున్నారని అన్నారు. ప్రస్తుతం గంజ్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు వద్ద రోడ్డుపై నిల్చుని పనులకోసం వేచి చూస్తున్నారని వివరించారు. తద్వారా రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడటం, ప్రయాణికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అడ్డాకూలీలు సైతం ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదేవిధంగా మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు లింగంపేట శేఖర్, నాగరాజు, రాంకుమార్, శివకుమార్, వెంకేటేశ్‌లు ఉన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: అడ్డాకుల మండల కేంద్రంలో భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న రాధిక కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడుతూ అడ్డాకులకు చెందిన రాధికను అదే మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన ముష్టిగొల్ల రాకేష్ రెండేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తే, అమ్మాయి తల్లిదండ్రులు అబ్బాయిని ఒప్పించి మార్చి 24న యాదగిరిగుట్టలో వివాహం జరిపించారని తెలిపారు. వివాహం అయిన వారం రోజులు మాత్రమే రాధికను అత్తగారింట్లో ఉంచుకొని.. ఆ తర్వాత పుట్టింటికి పంపించి ఆస్తి, కట్నం కింద డబ్బులు తీసుకురావాలని రాకేష్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు వేధింపులకు గురిచేశారని అన్నారు. భర్త రాకేష్, అత్తమామల వేధింపులు తాళలేక మే 18న రాధిక ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఇందుకు అత్తమామలు చంద్రమ్మ, కృష్ణలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు రాకేష్‌పై ఎస్సీ, ఎస్టీ 3(2)వీ కేసు నమోదు చేసినందున చట్ట ప్రకారం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యం రాజు, మండల అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి బాలరాజు, కాశీ, సులేమాన్‌తో పాటు మృతురాలి తల్లి సుక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పేదల కోసం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న జిల్లా కేంద్రానికి చెందిన ఆర్.రవిప్రకాష్‌కు యూఎస్‌ఏకు చెందిన హోలీ స్పిరిట్ క్రిస్టియన్ యూనివర్సిటీ (హెచ్‌ఎస్‌సీయూ) నుంచి గౌరవ డాక్టరేట్ దక్కింది. ఈ మేరకు ఆయనకు గురువారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో హెచ్‌ఎస్‌సీయూ ప్రతినిధులు ఈ అవార్డును ప్రదానం చేశారు.

అన్నమయ్య జయంతి

జడ్చర్ల: స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో సంస్కార భారతి ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా అన్నమాచార్యల గీతాలను ఆలపించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సంధ్య, రాధాకృష్ణ, గీత, కేతన, కీర్తన, నందిని పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

రాజాపూర్: మండల కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జీజేవైఎం నాయకులు సూరిగౌడ్, బాల్‌రాజ్, ప్రశాంత్‌చారీ అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాట్లాడారు. రాజాపూర్ శివారులోని సెజ్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయని అందులో వేలమంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో వైద్యంకోసం ఇటు జడ్చర్ల అటు బాలానగర్ వెళ్లాల్సిన అవసరం లేకుండా రాజాపూర్‌లో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేస్తే కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికావు

చిన్నచింతకుంట/దేవరకద్ర: చెక్‌డ్యాంల నిర్మాణాలపై అవగాహన లోపంతో నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నచింతకుంట మండలంలోని ముచ్చింతల, నెల్లికొండి గ్రామాల పరిధిలో ఊకచెట్టువాగుపై నిర్మిస్తున్న చెక్కడ్యాంలను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత లోపిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని.. ఎమ్మెల్యేను దూషిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. గోవర్ధన్‌రెడ్డి, గుంజశ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్, శాంతిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



బోడొనిగుట్టతండా పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

కోయిల్‌కొండ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇచ్చిన గడువులోగా పూర్తిచేయాలని ఏఎంఓ దుంకుడుశ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని జయనగర్ తండా, పల్గుతండా, బోడోనిగుట్టతండా, వర్దన్‌పల్లి తండా, కేశ్వాపూర్‌తండాలలోని ప్రభుత్వపాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మండలంలోని 46పాఠశాలల అభివృద్ధికి రూ. 1.31 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే రూ. 32లక్షలు నిధులు కాంట్రాక్టర్లకు అకౌంట్లకు చేరిందన్నారు. ఇచ్చిన గడువులోగా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, ఏఈ వెంకటేష్‌గౌడ్, మండల నోడల్‌ఆఫీసర్ వెంకటాజీ, సీఆర్‌పీలు శంకర్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు తరలిన మున్సిపల్ కార్మికులు



శిక్షణకు వెళ్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ తరగతులకు స్థానిక కార్మికులు తరలి వెళ్లారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల నుంచి పదిమంది చొప్పున శిక్షణకు హాజరు కానున్నారు. పదేళ్ల కిందట జరిగిన శిక్షణ తరువాత మళ్లీ ఇన్నేళ్లకు శిక్షణ ఇవ్వటంపై యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ సంతోషం వ్యక్తం చేశారు. శిక్షణలో కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించటంతోపాటు హక్కులు, బాధ్యతలపై సవివరంగా తెలియజేస్తారన్నారు. శిక్షణకు తరలిన వారిలో కేశవులు, విజయ్, కృష్ణ, అరుణ్‌కుమార్, విద్యాసాగర్, అలివేలు, దేవమ్మ, అంజమ్మ, యాదమ్మ, శ్యామల ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోయిల్‌కొండ: రాష్ట్రంలో ఆలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన కల్యాణమహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 15లోపు సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తారన్నారు. కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్‌గౌడ్, బండియాదవ్‌కుమార్, రవినాయక్, రామునాయక్, మహేందర్, సందీప్, శేఖర్, మనోజ్, రామస్వామి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు పనుల్లో రైతన్న బిజీబిజీ



రాయపల్లిలో ట్రాక్టర్‌తో తన పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రాజాపూర్: రెండురోజుల క్రితం కురిసిన వర్షానికి అదునుకావడంతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉంటున్నారు. దుక్కులు దున్ని విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. మండలంలోని తిరుమలాపూర్, దొండ్లపల్లి, ఈద్గాన్‌పల్లి, కల్లేపల్లి, పల్గుతండా, మల్లేపల్లి, నాన్‌చెరువుతండా తదితర గ్రామాల్లో మొక్కజొన్న, వరి, కూరగాయలు, పల్లి పంటలను సాగుచేసే రైతులు పనులను ముమ్మరం చేశారు. కాగా ఇదివరకు రైతులు తమ పొలాలలను దున్నేందుకు ఎక్కువగా ఎద్దులను ఉపయోగించేవారు. కానీ ప్రస్తుతం యంత్రయుగంలో ట్రాక్టర్లు వంటి వాటిని ఎక్కువగా వినియోగిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే మండల పరిధిలో దుక్కులు దున్నించేందుకు రైతులు ట్రాక్టర్ల యజమానుల ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ పెరగడం గమనార్హం.

వైభవంగా బసవేశ్వర స్వామి రథోత్సవం

నారాయణపేట రూరల్: స్థానిక సరాఫ్‌బజార్‌లోని శ్రీ బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు బుస్సయ్యస్వామి నేతృత్వంలో వైభవంగా పూజలు కొనసాగాయి. ఆలయంలోని బసవేశ్వరుడు, వీరభద్రేశ్వరుడి మూలవిరాట్‌కు మంజునాథ్, విశ్వనాథ్‌స్వామి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పాలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు.

బీటీరోడ్డు లేక అవస్థలు

- అధ్వానంగా నందిపేట, బస్వాయపల్లి రోడ్డు
- వర్షాకాలంలో వస్తే రోడ్డంతా బురదమయమే
- అవస్థలు తప్పడంలేదంటూ ఆయా గ్రామాల ప్రజల ఆవేదన
- బీటీరోడ్డు మంజూరు చేయాలని కోరుతున్న వైనం



నందిపేట, బస్వాయపల్లి మట్టి రోడ్డు

అడ్డాకుల: మూసాపేట మండలం నందిపేట నుంచి దేవరకద్ర మండలం బస్వాయపల్లి మధ్యన ఉన్న లింక్ రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు . నందిపేట నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బస్వాయపల్లి మట్టి రోడ్డు గుంతలమయంగా మారిందని దీంతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. ఇక వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుందని చెబుతున్నారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయని వాపోతున్నారు. కాగా ఇదివరకులి నందిపేట గ్రామస్తులు జీనుగరాల, డోకూర్ మీదుగా నియోజకవర్గ కేంద్రమైన దేవరకద్రకు వెళ్లేవారు. అయితే కొన్నాళ్ల నుంచి జీనుగరాల రోడ్డు పూర్తి అధ్వానంగా మారింది. దీంతో దేవరకద్ర వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రస్తుతం బస్వాయపల్లి మీదుగా దేవరకద్రకు వెళ్తున్నారు. బస్వాయపల్లి వరకు మట్టి రోడ్డే ఉండగా అక్కడి నుంచి దేవరకద్ర వరకు బీటీరోడ్డు ఉంది. నందిపేట నుంచి బస్వాయపల్లి వరకు బీటీరోడ్డు మంజూరు చేస్తే నందిపేటతో పాటు అడ్డాకుల మండలంలోని పొన్నకల్, రాచాల, నాగాయపల్లి, మూసాపేట మండలంలోని దాసర్‌పల్లి, చెన్నంపల్లి గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుంది. అధికారులు స్పందించి నందిపేట నుంచి బస్వాయపల్లి వరకు బీటీరోడ్డు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డు మంజూరు చేయాలి



మా ఊరి నుంచి నియోజకవర్గ కేంద్రమైన దేవరకద్రకు వెళ్లడానికి సరైన రోడ్డు వసతి లేదు. జీనగరాల రోడ్డు పూర్తి అధ్వానంగా మారడంతో బస్వాయపల్లి మీదుగా దేవరకద్ర వెళ్తున్నాం. బస్వాయపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డుపై బీటీ వేసేందుకు నిధులు మంజూరు చేయాలి.

–మహేష్, నందిపేట

ప్రతిపాదన పంపించాం



నందిపేట నుంచి బస్వాయపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డును బీటీరోడ్డుగా మార్చేందుకు లింక్ రోడ్ల విభాగంలో ప్రతిపాదనలు పంపించాం. రహదారుల నుంచి గ్రామ పంచాయతీలకు బీటీరోడ్ల మంజూరులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు. రెండో ప్రాధాన్యతలో లింక్ రోడ్లు మంజూరు చేసే సమయంలో ఈ రోడ్డుకు నిధులు రావొచ్చు.

–లక్ష్మణ్‌గౌడ్, పీఆర్ ఏఈ, మూసాపేట

వ్యాధులపై అవగాహన అవసరం

ధన్వాడ: కుష్టుపై ప్రజలకు సరైన అవగాహన ఉంటే వ్యాధిని వీలైనంతవరకు నిర్మూలించవచ్చని లెప్రసీ రాష్ట్ర టీం మెంబర్ డాక్టర్ సంపత్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ మేరకు వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఆశాకార్యకర్తల ద్వారా ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వ్యాధిలక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. మెడికల్ ఆఫీసర్ కీర్తి, డీపీఎంఓ వెంకటేశ్వర్లుచారి, సాకలరెడ్డి, వీరభద్రప్ప, కతలప్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతమ బుద్ధుడి బోధనలు అనుసరణీయం



జడ్చర్లలో బుద్ధుడి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థులు తదితరులు



జిల్లాకేంద్రంలో అన్నదాన కార్యక్రమం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కుల, మత వైషమ్యాలతో రగులుతున్న ప్రస్తుత సమాజంలో ఐక్యత నెలకొల్పి శాంతి, సమానత్వం, సమ సమాజ నిర్మాణానికి బౌద్ధమే శరణ్యమని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా.నాగయ్య, ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక స్టేషన్ రోడ్డులోని బుద్ధభవన్–బౌద్ధాలయంలో గౌతమ బుద్ధ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రకృతి ధర్మం, శాస్త్రీయ దృక్పథంతో బౌద్ధం కొన్ని వేల ఏళ్లపాటు కొనసాగిందన్నారు. దానిని పునరుద్ధరింపజేసి దేశ అభ్యున్నతితో పాటు అత్యున్నత స్థానంలో ఉంచడానికి అందరూ పాటు పడాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు రాములమ్మ, కార్యనిర్వాహక కార్యదర్శులు గోపాలకృష్ణ, వెంకటరాములు, గురువరాజు, నాయకులు ఆది లక్ష్మయ్య, బాలపీర్, బుర్రా సురేష్, దినేష్ పాల్గొన్నారు.

జడ్చర్ల: బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని బొటానికల్ గార్డెన్‌లో బుద్ధ జయంతి నిర్వహించారు. బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. గౌతమబుద్ధుడి బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సతీష్, రాధాక్రిష్ణ, రాహుల్ పాల్గొన్నారు.